క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

ఉంగుటూరు: పాతూరి శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో నేడు వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు మరడమంగరావు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీపై కార్యకర్తలను చైతన్య పరిచి ప్రజల్లోకి తీసుకెళ్లే సమయాత్తం అయ్యేందుకు ఈ చైతన్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మంగరావు తెలిపారు. ఈ సమావేశానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర రాజకీయ సలహా సంఘ కమిటీ సభ్యులు పుప్పాల వాసుబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు అందరూ పాల్గొనాలని మంగరావు కోరారు.

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా గణపతిరావు


కొలుసు గణపతిరావు

దెందులూరు: బీసీ సెల్ ఏలూరు జిల్లా కార్యదర్శిగా దెందులూరు సొసైటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొలుసు గణపతిరావు నియమితులయ్యారు. గురువారం ఈ మేరకు వైఎస్సార్ సీపీ అధినేత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. తనను పార్టీ బీసీసెల్ ఏలూరు జిల్లా కార్యదర్శిగా నియమించేందుకు కృషిచేసిన మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

కొల్లేరు రైతులను పక్షులతో సమానంగా చూడాలి

ఉంగుటూరు: కొల్లేరు రైతులను పక్షులతో సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, కోర్టులకు ఉందని స్పీకర్ రఘురామకృష్ణరాజు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉంగుటూరులో స్థానిక ఎమ్మెల్యే పి.ధర్మరాజు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కొల్లేరు రైతుల సమావేశంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఇటీవల కొల్లేరుకు వచ్చిన సుప్రీంకోర్టు నిజనిర్ధారణ కమిటీ తన నివేదికను సమర్పించనున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుతూనే జిరాయితీ రైతుల హక్కుల కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ కొల్లేరు ప్రజల జీవన విధానాన్ని కాపాడటానికి తాము పనిచేస్తున్నామని చెప్పారు.

పొడి ఇసుకలోనే కలుపు మందు కలపాలి

దెందులూరు: రైతులు పొడి ఇసుకలోనే కలుపు మందు కలిపి చేలల్లో చల్లాలని దెందులూరు మండలం వ్యవసాయ శాఖ అధికారి ఎల్ శ్రీనివాసరాజు అన్నారు. గురువారం మండలంలో దెందులూరు, కొవ్వలి గ్రామాల్లో నాట్లు వేసిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విధిగా పొడి ఇసుకలోనే కలుపు మందు క్రూజోర్ కలిపి పొలాలకు చల్లాలన్నారు. పొడి ఇసుకతో క్రూజర్ కలుపు మందు కలిపి పొలంలో చల్లితే ఎక్కువ విస్తీర్ణం కవర్ అవుతుందన్నారు. అలా కాకుండా యూరియాతో కలిపి చల్లితే చల్లిన చోట మాత్రమే పడుతుందని తెలిపారు. రైతులు ఎటువంటి ఒత్తిళ్లకు లోను కాకుండా ఉండాలని సూచించారు. మండలంలో 14000 ఎకరాల్లో 60 శాతం నాట్లు పూర్తయ్యాయన్నారు. మరో పది రోజుల్లోపు నూరుశాతం పనులు పూర్తవుతాయన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు అన్నారు. మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో శక్తి టీం సభ్యులతో కలిసి సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులకు గురువారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియా వేదికల (వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ మొదలైనవి) ద్వారా జరిగే మోసాలు, బ్లాక్ మెయిల్, ఫేక్ ఐడీ కేసులు గురించి వివరించారు. వ్యక్తిగత సమాచారం బహిరంగంగా పంచుకోవడంలో ఉన్న ప్రమాదాలు, ఫోన్ హ్యాకింగ్, ఫిషింగ్, ఓటీపీ ఫ్రాడ్స్ వంటి సైబర్ మోసాల్లో జరుగుతున్న పద్ధతులను తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జామాయిల్ లారీ బోల్తా


బోల్తా కొట్టిన లారీ

కుక్కునూరు: జామాయిల్ కర్రను తీసుకెళ్తున్న లారీ బుధవారం అర్ధరాత్రి మండలంలోని పెద్దరావిగూడెం గ్రామ సమీపంలో బోల్తా పడింది. జామాయిల్ కర్రల లోడ్‌తో కుక్కునూరు మీదుగా సారాపాక ఐటీసీ కర్మాగారానికి వెళ్తున్న లారీ రాత్రి 11 గంటల సమయంలో పెద్దరావిగూడెం, వెంకటాపురం గ్రామాల మధ్య టర్నింగ్ వద్ద బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

పేరుకే జంక్షన్.. ప్రయాణానికి టెన్షన్

- భీమడోలు జంక్షన్‌లో ఆగని ఎక్స్‌ప్రెస్ బస్సులు
- బస్సుల కోసం భక్తుల పడిగాపులు
- ప్రయాణికుల వెతలను పట్టించుకోని ఆర్టీసీ
- రైల్వే స్టేషన్‌లోనూ అరకొర ఆగుతున్న రైళ్లు


భీమడోలు జంక్షన్ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం ఎదురు చేస్తున్న జనం (ఫైల్)

భీమడోలు: భీమడోలు అంటేనే జంక్షన్ ప్రాంతం. దీనికి తోడు ద్వారకాతిరుమల పుణ్య క్షేత్రానికి చేరుకోవాలంటే ఇక్కడి నుంచి వెళ్లాల్సిందే. జంక్షన్‌గా పేరున్నా నామమాత్రపు ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయడంతో పలు జిల్లాల నుంచి వచ్చే భక్తులు, 50 గ్రామాలకు చెందిన ప్రయాణికులు నానా తిప్పలు పడుతున్నారు. పాలకులు, అధికారులు ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలుపుదల చేస్తామని హామీలు ఇస్తున్నా, ఆచరణలో మాత్రం నీరుగారుస్తున్నారు. దీంతో ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి భక్తుల సౌకర్యార్థం కనీసం దేవస్థానం అధికారులు బస్సుల నిలుపుదల కోసం వారు చూపే శ్రద్ధ శూన్యం. దీంతో దేవాలయం ఆదాయంపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. అదే విధంగా భీమడోలు రైల్వే గేటు వద్ద హైవే కూడా ఒక్క ఎక్స్‌ప్రెస్ కూడా ఆగని దుస్థితి నెలకొంది.

అరకొర ఎక్స్‌ప్రెస్‌లతో అవస్థలు

జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న భీమడోలు జంక్షన్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు రాక దూర ప్రాంతాలకు వెళ్లే భక్తులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వచ్చే అరకొర ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుండుగొలను నుంచి కొవ్వూరు వరకు నేషనల్ హైవే విస్తరించడంతో ఎక్స్‌ప్రెస్‌లన్నీ హైవేపై వెళుతున్నాయి. గతంలో తప్పనిసరిగా భీమడోలు జంక్షన్‌కు వచ్చి వెళ్లే ఆ బస్సులన్నీ కొత్త హైవేపై నుంచి వెళ్లిపోతుండడంతో సమస్యకు కారణంగా మారిందని భక్తులు, ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. భీమడోలు జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపాలని కోరుతూ ప్రజా ప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు అనేక సార్లు వినతులు అందించినా ఆర్టీసీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో ఆర్టీసీ అధికారుల పనితీరును బాహాటంగా విమర్శిస్తున్నారు. అదే విధంగా రైల్వే స్టేషన్‌లో రైళ్లు కూడా అరకొర ఆగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైలు ప్రయాణికులకు భీమడోలు జంక్షన్‌లో పలు రైళ్లకు హాల్ట్ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ద్వారకాతిరుమలకు వెళ్లాలన్నా.. స్వగ్రామాలకు చేరుకోవాలన్నా

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలలోని శ్రీవారిని దర్శించుకునేందుకు వెళ్లాలన్నా, తిరిగి వారి స్వగ్రామాలకు వెళ్లాలన్నా బస్సులు లేక భీమడోలు జంక్షన్ వద్ద భక్తులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. గుండుగొలను నుంచి కొవ్వూరు వరకు జాతీయ రహదారిని విస్తరించక పూర్వం ప్రతి ఎక్స్‌ప్రెస్ భీమడోలు జంక్షన్‌కు వచ్చేది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లాలన్నా, అక్కడి నుంచి స్వగ్రామాలకు రావాలన్నా ఇబ్బందులు ఉండేవి కావు. కానీ ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ బస్సులు పూర్తి స్థాయిలో నిలుపుదల చేయపోవడంతో వచ్చే అరకొర బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

బస్సుల కోసం పరుగులు

అయితే ఇక్కడి బస్టాండ్ ఉన్నా, ప్రాంగణంలోకి కేవలం పల్లె వెలుగు బస్సులు తప్ప ఎక్స్‌ప్రెస్ బస్సులు వెళ్లవు. వచ్చే అరకొర ఎక్స్‌ప్రెస్‌లు ప్రాంగణంలోకి రాకుండా రోడ్డుపై ఆగి వెళ్లిపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రాంగణంలోకి వచ్చే ప్యాసింజర్ల కోసం ఎదురు చూస్తుండగా, అదే సమయంలో బస్టాండ్‌కు బయట రోడ్డుపై ఎక్స్‌ప్రెస్, ప్రైవేట్ వాహనాలు వస్తే కుటుంబ సమేతంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు ఉరుకులు పరుగులు తీయాల్సి వస్తుంది. శనివారం, ఆదివారాలతో పాటు పలు శుభ దినాల్లో రెట్టింపు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని వాపోతున్నారు.

పండుగ సీజన్లలో భారీగా భక్తుల రాకపోకలు

నిత్యం ఈ ప్రాంగణం నుంచి 2500 మంది ఉమ్మడి జిల్లాలకు చెందిన భక్తులు, ప్రయాణికులు ద్వారకాతిరుమలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం బయట రోడ్డుపై ఎండనక, వాననక గంటల కొద్దీ ప్రయాణికులు నిరీక్షించాల్సి వస్తుంది. ప్యాసింజర్ బస్సుల కోసం ప్రాంగణంలోకి, ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం బయటకు పరుగెత్తి హైరానా పడుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ఉన్నప్పటికీ బస్సులు ఎక్కేందుకు పడే బాధలు వర్ణనాతీతమని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా భీమడోలు జంక్షన్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలిపేలా ఆర్టీసీ అధికారులు, కూటమి నాయకులు తగు శ్రద్ధ వహించాలని ప్రజలు వేడుకుంటున్నారు.


భీమడోలు బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు (ఫైల్)


పల్లె వెలుగు బస్సు ఎక్కేందుకు పరుగులు తీస్తున్న జనం(ఫైల్)

గోపన్నపాలెంలో నేడు ప్రతిష్ఠా విగ్రహాల ఊరేగింపు

దెందులూరు: గోపన్నపాలెంలోని శ్రీకోదండ రామాలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాల ఊరేగింపు శుక్రవారం నిర్వహించనున్నారు. ఆగస్టు 4న ఉదయం 8.10 గంటలకు శ్రీసీతారామాంజనేయ, లక్ష్మణ, గణేశ, సుబ్రహ్మణ్య, శ్రీకృష్ణ, అయ్యప్ప స్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని ఏనుగు వెంకటేశ్వరరావు లక్ష్మి దంపతులు భక్త బృందం తెలిపారు. గ్రామంలో 2 నుంచి 4వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని సమీప గ్రామాల్లో భక్తులు విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవానికి హాజరై స్వామి వారి దీవెనలు పొందాలన్నారు. 4వ తేదిన ఉదయం 11 గంటలకు మహా అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: సబ్ స్టేషన్ పరిధిలో ఒకటో తేదీ శుక్రవారం చెట్ల కొమ్మలు నరకడం, మరమ్మతుల నేపథ్యంలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ శివాజీ గురువారం తెలిపారు. భీమడోలు సబ్‌స్టేషన్ పరిధిలోని గుండుగొలను, నాగహనుమాన్, సూరప్పగూడెం, పోలసానిపల్లి గ్రామాల్లోని ఫీడర్ల పరిధిలో పాతూరు, దిగులుపాటి దిబ్బలు గ్రామాలకు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

దెందులూరులో..

దెందులూరు: మండలంలోని పోతునూరు సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉండ్రాజవరం, పోతునూరు, కేధవరం, కొవ్వలి, దోసపాడు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఐదు గ్రామాల్లో వినియోగదారులు విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

జెడ్పీ సమావేశంలో తీర్మానం చేస్తాం


ఏలూరు, దెందులూరు జెడ్పీటీసీలు లీలా నవకాంతం, సరస్వతి

దెందులూరు: జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక పకడ్బందీగా నిర్వహించేలా జిల్లా పరిషత్‌లో తీర్మానం చేస్తామని ఏలూరు జెడ్పీటీసీ మండల సరస్వతి, దెందులూరు జెడ్పీటీసీ లీలా నవకాంతం అన్నారు. గురువారం ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రులో జెడ్పీటీసీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజల నుంచి వినతుల స్వీకరణ కార్యక్రమం అన్ని శాఖల అధికారులు పాల్గొనడం లేదన్నారు. ఇటీవల ఏలూరులో ఒక జిల్లా అధికారి కార్యాలయానికి స్వయంగా ఇద్దరు జెడ్పీటీసీలు వినతిపత్రం ఇవ్వటానికి వెళితే మధ్యాహ్నం 12.45 గంటల వరకు జిల్లా అధికారి రాలేదన్నారు. మండలాల్లో సైతం ఐదారుగురు మాత్రమే అధికారులు హాజరవుతున్నారన్నారు. దాదాపు 30 ప్రభుత్వ శాఖలు ఉంటే ఐదారుగురు అధికారులు హాజరవ్వడం సరికాదన్నారు. 2న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ విషయాన్ని సమావేశం దృష్టికి తీసుకొచ్చి తీర్మానం చేయించారు. జిల్లా మండల అధికారుల విధి నిర్వహణలో కచ్చితంగా మార్పు రావాలని జెడ్పీటీసీలు అన్నారు. పర్యవేక్షణ అధికారులైన కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సోమవారం ప్రజా వినుతుల కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులపై వివరణ కోరినా మార్పు రాని అధికారులపై తదుపరి చర్యలు తీసుకోకపోతే ప్రజలకు సత్వర న్యాయం జరగదన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దు


గణపవరంలో అధికారులతో సమీక్షిస్తున్న డీపీఓ రామనాథరెడ్డి

గణపవరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా పంచాయతీ అధికారి రామనాథరెడ్డి అన్నారు. గురువారం గణపవరం గ్రామంలో ఆయన పర్యటించారు. పలు ప్రాంతాలలో పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. మురుగు డ్రెయిన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, ప్లాస్టిక్ వినియోగంపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పంచాయతీ పన్నులు, పన్నేతర వివరాలను పంచాయతీ కార్యదర్శి శివరామ్ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సరఫరా విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఫిల్టర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, స్వచ్ఛమైన నీటిని క్లోరినేషన్ చేసి ప్రజలకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలోఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి, సర్పంచ్ మూర అలంకారం, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, తోట శ్రీను, ఇర్రింకి శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే రికార్డుల పరిశీలన


రీసర్వే రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: మండలంలో పైలెట్ ప్రాజెక్టు రెండు గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే పనుల రికార్డులను గురువారం దెందులూరు తహసీల్దార్ బి.సుమతి తనిఖీ చేశారు. దెందులూరు మండలం రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన సరిహద్దుల నమోదు ఆన్‌లైన్‌లో వివరాల నమోదును గ్రామాల వారీగా చూపించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మండల సర్వేయర్ అన్ని గ్రామాల సర్వేయర్లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు సరిహద్దుల నిర్ధారణలో రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా చేయాలన్నారు. ముందుగా నోటీసు ఇచ్చే విషయాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ మరువకుండా సరిహద్దు నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ఇచ్చిన గడువు లోపు రీసర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు.

హాస్టల్‌లో మద్యం, సిగరెట్లు


ఏలూరు ఎస్సీ కాలేజ్ హాస్టల్‌ను సందర్శించిన ఎస్ఎఫ్ఐ బృందం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ హాస్టల్ విద్యార్థులను చెడు మార్గంలోకి ప్రోత్సహించే విధంగా సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారుల పనితీరు ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా అన్ని హాస్టల్లో సర్వే చేస్తున్నట్టు చెప్పారు. గురువారం రాత్రి ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్లో సర్వే చేశామన్నారు. విద్యార్థులు హాస్టల్లో ఎప్పుడూ ఉండే బాత్రూం సమస్యలు భోజనం సరిగ్గా ఉండటం లేదని తెలిపారు. ఈ హాస్టల్లో సిగరెట్లు, మద్యం సేవించేవారు ఎక్కువ శాతం ఉన్నట్టు గుర్తించామన్నామరు. హాస్టల్ డాబా పైన రాత్రి 10 నుంచి 12 గంటల మధ్యలో హాస్టల్ విద్యార్థులు బయట వ్యక్తులు వచ్చి మందు తాగుతున్నారని తెలిపారు. వార్డెన్ ఎన్నిసార్లు చెప్పినా విద్యార్థులు మారడం లేదని తెలిపారు. ఈ ఏడాది అడ్మిషన్లు 50 శాతాని కంటే ఎక్కువ గానే పడిపోయిందన్నారు. హాస్టల్ మేడ పై అన్నీ సిగరెట్ ప్యాకెట్లు, గుట్కా ప్యాకెట్లు, మందు బాటిల్ ఉన్నాయని చెప్పారు. పక్కనున్న అంబేడ్కర్ భవన్లో పైన కూడా మందు బాటిల్స్ ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ ప్రాంతాల్లో మద్యాన్ని సేవిస్తున్నారని తెలిపారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు శివాజీ, జయంత్, శివసాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి

- ఎన్నికల హామీలను అమలు చేయాల్సిందే
- 2న నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ముళ్లగిరి జాన్సన్, ఎంపీపీ కనుమాల రామయ్య తదితరులు

భీమడోలు: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు వాటిన్నింటినీ అటకెక్కించిన ఘనుడని, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. భీమడోలులోని రైతు విభాగం నియోజకవర్గ కన్వీనర్ పసుపులేటి సత్యనారాయణ ఇంటి వద్ద గురువారం సాయంత్రం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంపై మండల స్థాయి ముఖ్య నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 2వ తేదీ శనివారం సాయంత్రం భీమడోలులోని వీసీ కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న మండల, విస్తృత స్థాయి సమావేశంపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా హాజరైన మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీపీ కనుమాల రామయ్యలు మాట్లాడారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్న విషయాన్ని ప్రజలు గుర్తించారని, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న చంద్రబాబు పాలనపై పవన్ కల్యాణ్‌లు నోరు విప్పకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, రుణాంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు, బాండ్లు ప్రజలకు తెలియజేసేలా రూపొందించిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఇంటింటికీ వెళ్లి బాబు మోసాలను వారికి వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీలోని అన్ని విభాగాల్లోని నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన బూటకపు హామీల వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ నెల 2వ తేదీన భీమడోలులో జరిగే విస్తృత స్థాయి సమావేశానికి ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరు కానున్నారని, ఈ సమావేశానికి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మద్దుల రాజా, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ ఆళ్ల శ్రీనివాస్, బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, పంచాయతీరాజ్ సెల్ కన్వీనర్ రామిశెట్టి శ్రీను, నియోజకవర్గ గ్రీవెల్ సెల్ కన్వీనర్ పాము మాన్‌సింగ్, నాయకులు సుతాపల్లి ప్రసాద్, కిలపర్తి భాస్కరరావు, కొడవలి రవికుమార్, ఆళ్ల సురేష్, బుర్రకాయల కిరణ్, బి.భాస్కరావు, రమేష్, రవి, ప్రసాద్, నాగభూషణం పాల్గొన్నారు.

ఆటోల్లో కూలీలను దించి.. బస్సుల్లో ఎక్కించి


భీమడోలు హైవే వద్ద ఆటోల్లోంచి కూలీలను దింపుతున్న పోలీసులు



ఆర్టీసీ బస్సుల్లో కూలీలను ఎక్కిస్తున్న సీఐ యూజే విల్సన్, ఎస్సై సుధాకర్

భీమడోలు: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించడం ప్రమాదకరమని, ప్రయాణికుల ప్రాణాలు ముఖ్యమని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా గురువారం జాతీయ రహదారి భీమడోలు వద్ద ఎస్సై వై.సుధాకర్, సిబ్బందితో కలిసి సీఐ యూజే విల్సన్ విజువల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా కొందరు కూలీలు పరిమితికి మించి ఆటోల్లో ఉండడాన్ని గుర్తించి వాటిని నిలిపివేశారు. ఆటో డ్రైవర్లు, కూలీలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రయాణికుల సంఖ్యపై నియంత్రణ పాటించాలని కోరారు. ఒక ఆటోలో 4, 5 మంది ప్రయాణించడం హానికరమన్నారు. ఆటోలో ఉన్న సిట్టింగ్, లోడ్ సామర్థ్యం మేరకు ప్రయాణికులను అనుమతించాలని కోరారు. ఆటో డ్రైవర్లు విధిగా రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ వంటి పత్రాలు సమగ్రంగా ఉంచాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారి భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు పాటించేందుకు ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు బాధ్యత వహించాలన్నారు. అనంతం వారిని దించి వారి ప్రాణ భద్రత దృష్ట్యా ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల నమ్మకం కోల్పోతున్న ప్రభుత్వం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత పథలు అమలు చేయాలంటే భయమేస్తోందని చంద్రబాబు ప్రకటించడాన్ని పలాయన వాదంగా ప్రజలు భావిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయ ప్రకాష్ (జేపీ) అన్నారు. గురువారం నగరంలోని మదిరి నిర్మల జ్యోతి, జేవియర్ మాస్టర్ ఆధ్వర్యంలో, 16వ డివిజన్‌లో జుజ్జువరపు విజయ నిర్మల, జుజ్జువరపు రమేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేపీ పాల్గొని మాట్లాడారు. 24, 25, 26వ డివిజన్‌లలో స్థానిక నాయకులు జక్కుల బెనర్జీ, స్టాలిన్, మట్టా రాజు, వీరవల్లి లక్ష్మి కుమార్, గోరుముచ్చు రవి, కొండేటి చిన్ని, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని, ఎక్కడ చూసినా మహిళలపై దాడులు, హత్యాచారాలు పెరిగిపోయాయని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో రాష్ట్రంలోని మహిళా లోకానికి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు అండగా నిలవాలని ఆయన కోరారు. రాష్ట్ర మహిళా విభాగ జనరల్ సెక్రటరీగా నియమితులైన తుమరాడ స్రవంతి గురువారం తనను మర్యాదపూర్వకంగా కలిసిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మహిళలను ఎలా మోసం చేస్తోందో తెలుపుతూ మహిళల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు.